బల్క్ ఓట్ల వేటలో అభ్యర్థులు



ఆరాంఘర్‌లో అపార్ట్‌మెంట్ వాసులతో బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి

- ఓట్లు రాబట్టుకునేందుకు ప్రధాన పార్టీల తీవ్ర ప్రయత్నాలు
- అపార్టుమెంట్లు, విల్లాల వాసులతో సమావేశం



హారతితో స్వాగతం పలుకుతున్న మహిళ

రాజేంద్రనగర్: నియోజకవర్గ ప్రధాన పార్టీ అభ్యర్థులు బల్క్ ఓట్లకోసం పోటీ పడుతున్నారు. రోడ్‌షో, ఇంటింటి ప్రచారానికి బదులుగా బల్క్‌గా అపార్ట్‌మెంట్లు, విల్లాలు, బస్తీలు, యువజన, కుల సంఘాలతో నేరుగా సమావేశమవుతున్నారు. తమకు మద్దతు ఇవ్వాలంటూ ఈ సమావేశాల్లో బరిలో నిలిచిన అభ్యర్థులు వేడుకుంటున్నారు.

◆ బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో పాటు మజ్లిస్ పార్టీ సైతం ఈ వ్యవహారంలో చురుకుగా ఉన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మజ్లిస్ పార్టీ సైతం బల్క్ ఓట్లకోసం సమావేశాలు, సమీక్షలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీ హిందూ అభ్యర్థిని బరిలోకి దించడంతో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ప్రధాన పార్టీలన్నీ బల్క్ ఓట్ల వేటలో తలామునకలయ్యాయి.

మార్నింగ్ వాక్...

◆ నియోజకవర్గంలో బరిలో నిలిచిన అభ్యర్థులు మార్నింగ్ వాక్‌లపై దృష్టి సారించారు. మార్నింగ్ వాక్‌లో ఓటర్లు పెద్ద సంఖ్యలో పార్కులు, క్రీడా మైదానాలు, ఓపెన్ ప్లేస్‌లలో వాకింగ్ కోసం వస్తుండటంతో వారితో నేరుగా ములాఖత్ అవుతున్నారు. మార్నింగ్ వాక్‌లోనే వారితో అక్కడే సమావేశాలు, సమీక్షలు నిర్వహిస్తూ.. తమకు ఓటు వేయాలని విన్నవిస్తున్నారు. వారితో నేరుగా వాకింగ్‌లో పాల్గొంటూ ఆకర్షిస్తున్నారు. ఒకేసారి వందల మందిని కలుస్తూ తమ సమయాన్ని ఆదా చేసుకుంటున్నారు.

కాలనీవాసులతో సమావేశాలు..

◆ నియోజకవర్గంలో కొత్తగా అపార్ట్‌మెంట్‌లు, బస్తీలు, కాలనీలు, విల్లాలు వెలిశాయి. ఓటర్లంతా నగరం నలువైపుల నుంచి కొత్తగా వచ్చిన వారే ఎక్కువ శాతం ఉన్నారు. అలాగే ఉత్తరాది, వివిధ జిల్లాల నుంచి వారు అత్యధికంగా ఉన్నారు. వీరంతా ప్రస్తుతం నియోజకవర్గంలో ఓటర్లుగా నమోదు చేసుకుని ఓటుహక్కు కలిగి ఉన్నారు. వీరిని ప్రసన్నం చేసుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నేరుగా అపార్ట్‌మెంట్, కాలనీలు, బస్తీలు, విల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందర్ని ఒకేచోట సమావేశ పరిచి వారితో పరిచయం చేసుకుని వారి సమస్యలను తెలుసుకుని తమకు ఓటు వేయాలని విన్నవిస్తున్నారు. చిన్న చిన్న పనులను అప్పటికప్పుడు జరిగేలా చర్యలు చేపడుతున్నారు. బల్క్‌గా వీరి ఓట్లను తమ ఖాతాలోకి తెచ్చుకునేందుకు విందులను ఏర్పాటు చేస్తున్నారు.

జూకల్‌లో తోకల రోడ్‌షో..

శంషాబాద్ రూరల్: అసెంబ్లీలో నిద్రపోయే ఎమ్మెల్యే ఈ నియోజకవర్గం ప్రజలకు ఎలా మేలు చేస్తాడో ప్రజలు తెలుసుకోవాలని బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. సోమవారం మండలంలోని జూకల్‌లో రోడ్‌షో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. వివిధ పార్టీలకు చెందిన పలువురు తోకల సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా.. వృద్ధులకు పెన్షన్ల పేరుతో కేసీఆర్ సర్కారు జనాన్ని మోసం చేస్తోందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే మేనిఫెస్టోలోని అన్నింటినీ అమలు చేస్తామన్నారు. నాయకులు గోపాల్, ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'ఢిల్లీ పార్టీలను తరిమికొట్టాలి'

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్



మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

మణికొండ: ఢిల్లీతో పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో మళ్లీ వారి అజమాయిషీ వద్దని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. సాధించిన తెలంగాణను అన్ని రంగాల్లో దేశంలోనే మొదటి స్థానంలో నిలిపిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకొచ్చి ప్రగతిని కొనసాగించాలని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మలినగర్, నెక్నాంపూర్, అలకాపూర్ టౌన్‌షిప్, పుప్పాల్‌గూడ, వేంకటేశ్వర కాలనీ, సెక్రటేరియట్ కాలనీ, హుడాకాలనీ, పంచవటీ కాలనీ, మణికొండ మర్రిచెట్టు, చిత్రపురి కాలనీలలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కూడలీలలో ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీ పార్టీలు అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని దోచుకోవటం, పంచుకోవటానికి కేంద్రంగా తయారు చేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు ఎలా ఉన్నా ఆరు మంది ముఖ్యమంత్రులు మారటం తప్పదన్నారు. బీజేపీ పార్టీకి పది స్థానాల్లోను గెలిచే సత్తా లేదని, అలాంటి పార్టీలకు ఓటు వేసి వృథా చేసుకోవద్దన్నారు. నియోజకవర్గానికి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఉండి పార్టీలను పక్కన పెట్టి అందరినీ కలుపుకుని పనిచేయటంతోనే అన్ని మున్సిపాలిటీలు, డివిజన్లు పోటాపోటీగా అభివృద్ధి సాధించాయన్నారు.

చేయాల్సిన అభివృద్ధి చాలా ఉంది...

నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.1500 కోట్లతో అభివృద్ధి జరిగిందని, రాబోయే రోజుల్లో మెట్రోరైలు, మూసీ సుందరీకరణ, వంతెనల నిర్మాణం, గండిపేట చెరువు చుట్టూరా సైకిల్‌ట్రాక్ లాంటి పెద్దపనులు చేయాల్సి ఉందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. అవన్నీ పనులు చేసి నియోజకవర్గాన్ని నందనవనంగా తీర్చిదిద్దుతానన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్టీ సమన్వయకర్త, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీరాములు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు బషీర్, సీతారాం, గుట్టమీది నరేందర్, శ్రావణ్‌కుమార్, లక్ష్మిశ్రీ, నీలేష్‌ప్రసాద్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు అడుగడుగున మంగళహారతులతో స్వాగతం పలికారు.

ప్రకాష్‌గౌడ్‌తోనే ప్రగతి..

మణికొండ: నియోజకవర్గానికి మూడుసార్లు పార్టీలకు అతీతంగా ప్రగతిని సాధించాలనే పట్టుదల ఉన్న ప్రకాష్‌గౌడ్ ఎమ్మెల్యేగా పనిచేసినందునే ప్రజలు సమస్యలు లేకుండా జీవిస్తున్నారని నార్సింగి మున్సిపాలిటీ చైర్మన్ రేఖ యాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్, పార్టీ అధ్యక్షుడు ఆర్.నర్సింహ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధి గొలిదొడ్డి, నార్సింగి, ఖానాపూర్ గ్రామాల్లో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలతో పాటు అన్ని రంగాల అభివృద్ధి సాధించి దేశంలోనే మొదటి స్థానంలో రాష్ట్రం ఉందన్నారు. ఇలాంటి అభివృద్ధి చేసిన నాయకులను ప్రజలు మరోసారి ఎన్నుకోవాలని కోరారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



అలకాపూర్ చౌరస్తాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కస్తూరి నరేందర్

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కస్తూరి నరేందర్

మైలార్‌దేవ్‌పల్లి: కాంగ్రెస్ పాలనతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాజేంద్రనగర్ కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్ అన్నారు. సోమవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో కార్యకర్తలతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయనకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా కస్తూరి నరేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగి పోయారని కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులు ప్రజలు మరువలేరన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలోని 6 పథకాలను గెలిచిన వెంటనే అమలు చేసే మాట తప్పని పార్టీ కాంగ్రెస్ అని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ చేతి గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గం సీనియర్ నేతలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శాస్త్రిపురం, సులేమాన్‌నగర్, అత్తాపూర్ డివిజన్లకు చెందిన మైనార్టీ యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్ ఆధ్వర్యంలో సోమవారం రోడ్‌షోలను నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీల వారీగా మైనార్టీలు పార్టీలో కస్తూరి నరేందర్ సమక్షంలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మైనార్టీ బస్తీలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రోడ్‌షోలను నిర్వహించారు.

కాంగ్రెస్‌లోకి కార్పొరేటర్..

బండ్లగూడ: ప్రజలు మరింత మెరుగైన సౌకర్యాలు, అభివృద్ధి కల్పించేందుకే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ స్రవంతినరేందర్ అన్నారు. సోమవారం ఆమె టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆమె కాంగ్రెస్‌లో చేరారు. గత కొంత కాలంగా బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలు, సమావేశాలలో సైతం ఆమె కనపడటం లేదు. బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నారు అనే ఊహాగానాలకు సోమవారం తెరపడింది. రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి జరుగుతుందని నమ్మి బీఆర్ఎస్‌ను వీడానన్నారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తానని స్పష్టం చేశారు.



సులేమాన్‌నగర్‌లో రోడ్‌షోలో..



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లోకి స్రవంతి

సీబీఆర్ఎన్ నిర్వహణపై శిక్షణ



శంషాబాద్: కెమికల్, బయోలాజికల్, రేడియాలాజికల్, న్యూక్లియర్ (సీబీఆర్ఎన్) అత్యవసర నిర్వహణ శిక్షణ కార్యక్రమాన్ని జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్, నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సంయుక్తంగా ప్రారంభించింది. సోమవారం ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమం ఈనెల 24 కొనసాగనుంది. అత్యవసర పరిస్థితుల్లో ఎయిర్‌పోర్టు ఎమర్జెన్సీ హ్యాండ్లర్లు సంసిద్ధతతో స్పందించే విధానంతో పాటు ఎయిర్‌పోర్టులో సీబీఆర్ఎస్ ద్వారా కలిగే ముప్పులను ముందస్తుగా అరికట్టడం, ఎదుర్కొనే విధానంపై చర్చించారు. ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్‌ఫణీకర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ శిక్షణ పొందిన నిపుణుల సేవలు ఎంతో అవసరమన్నారు. అర్హత సాధించిన వారికి సర్టిఫికెట్లను అందజేయనున్నారు. వివిధ జాతీయ రక్షణ సంస్థలు పాల్గొన్నాయి.

దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దే ఓటింగ్



మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర తదితరులు



ఓటుహక్కును వినియోగించుకుంటున్న వృద్ధురాలు

బండ్లగూడ: అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సాధారణ ఎన్నికలు– 2023లో భాగంగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్‌లో పోలింగ్ బూత్‌కి వెళ్లి ఓటు వెయ్యలేని దివ్యాంగులు, వృద్ధులకు తమ ఇంట్లోనే ఉండి ఓటు వేయించేందుకు రెండు అధికారుల టీమ్‌లు పనిచేశాయి. ఈ ఓటింగ్ ప్రక్రియ సోమ, మంగళవారాలు రెండ్రోజులు జరుగుతుందన్నారు. ఈ ఓటింగ్ కార్యక్రమాన్ని కమిషనర్ పర్యవేక్షిస్తూ.. స్వయంగా పరిశీలించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫామ్–12డీ సద్వినియోగం..

అత్తాపూర్: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయాలని లేని వికలాంగులు, వృద్ధుల సౌకర్యార్థం ఫామ్–12డీ ద్వారా ప్రత్యేక ఓటును కల్పిస్తున్నామని రాజేంద్రనగర్ ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లయ్య తెలిపారు. ఓటు వినియోగం కోసం ప్రత్యేకంగా ఆరు టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. వీరందరూ ఫామ్–12డీకి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇంటికి వెళ్లి ఓటింగ్ నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఓటింగ్ ప్రక్రియ సోమవారం, మంగళవారం కూడా ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

మణికొండ: యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధి హైదర్షాకోట్‌లో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ, బాపట్ల జిల్లా, భవనం వారి పాలెం గ్రామానికి చెందిన ఇంటూరి జగదీష్ (24) సివిల్ ఇంజినీరింగ్ చదువుకుని బండ్లగూడలో నిర్మాణంలో ఉన్న ఓ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ సంస్థలో సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. కాళిమందిర్ వద్ద ఉన్న సంస్థ గెస్ట్‌హౌస్‌లో నివసిస్తున్నాడు. ఈ నెల 18న గెస్ట్‌హౌస్ నుంచి తన స్నేహితుడు మనోజ్‌కుమార్ ఉంటున్న హైదర్షాకోట్‌లోని సామ్రాట్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌కు వెళ్లాడు. జగదీష్, మనోజ్‌కుమార్‌లతో పాటు మరికొంత మంది స్నేహితులు అదేరోజు ఫ్లాట్‌కు వచ్చారు. వారి మధ్య గొడవ జరిగి జగదీష్‌ను కొట్టి హత్య చేశారని మృతుడి మేనమామ వీర నాగాంజనేయులు ఆరోపిస్తున్నారు. రెండ్రోజులుగా ఫోన్ చేస్తున్నా.. స్పందించక పోవడంతో సోమవారం ఉదయం అతడు పనిచేస్తున్న సంస్థకు వచ్చి వాకబు చేశానన్నారు. అతడు గెస్ట్‌హౌస్ నుంచి స్నేహితుడు మనోజ్‌కుమార్ ఇంటికి రెండ్రోజుల క్రితమే వెళ్లాడని తెలుసుకుని వెళ్లాడు. సదరు ఫ్లాట్ తలుపులు తీసి ఉండటం, బెడ్‌పై జగదీష్ తీవ్ర గాయాలతో అనుమానాస్పద మృతి చెందాడు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్నేహితులే కొట్టి చంపారని ఆయన ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం మృతుడి స్నేహితులు పరారీలో ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఓనర్ల చెంతకు సెల్‌ఫోన్లు..!

అత్తాపూర్: మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న ముగ్గురు బాధితులకు సోమవారం వారి ఫోన్లను అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి అందజేశారు. అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ముగ్గురు వ్యక్తులు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మొబైల్ ఫోన్ల గుర్తించి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు వెంటనే బాక్స్‌పైన ఉన్న ముఖ్యమైన నంబర్లతో సంబంధిత పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. దొంగిలించిన ఫోన్లను ఇతర రాష్ట్రాల్లో విక్రయిస్తుంటారన్నారు. ఈ ఫోన్లను రికవరీ చేసిన క్రైమ్‌టీమ్ సిబ్బంది వెంకటరమణ, ఇంతియాజ్, అహ్మద్, ఆశ్విని, కృష్ణలను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

మణికొండ: పేదల సంక్షేమానికి కృషి చేసింది కాంగ్రెస్ పార్టీనేనని కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్ పురుషోత్తం, నాయకులు ప్రభావతి, సత్యనారాయణ, శివారెడ్డిలు అన్నారు. సోమవారం వారు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్‌లో ఎమ్మెల్యేగా నరేందర్‌ముదిరాజ్ గెలిస్తే అభివృద్ధి పరుగులు పెడుతుందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ గెలిస్తేనే నియోజకవర్గ అభివృద్ధి

అత్తాపూర్: రాజేంద్రనగర్ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం రాచూరి రాజశేఖర్ ఆధ్వర్యంలో లాలాలజపత్‌రాయ్ శక్తి కేంద్రం తేజస్వినగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కమలం గుర్తుకు ఓటు వేసి తోకల శ్రీనివాస్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఆయనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తారన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



శంషాబాద్: ఎన్నికల్లో ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆర్‌జీఐఏ పోలీసులు సాతంరాయి, గగన్‌పహాడ్‌లో సోమవారం ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించారు. ఏసీపీ రాంచందర్‌రావు ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై సుమన్‌తో పాటు వందల సంఖ్యలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు.

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



నార్సింగిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మణికొండ: ఈనెల 30న జరిగే సాధారణ ఎన్నికల ఏర్పాట్లను నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి టై టులంగ్ పమేయా పరిశీలించారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు, భద్రత, ఫర్నిచర్, గదులు, ఓటర్ల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పెరిగిన ఓటర్లకు అనుగుణంగా సౌకర్యవంతంగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్‌కు వచ్చే ఓటర్లకు టాయిలెట్స్, తాగు నీరు తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు. నార్సింగి మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి, డీఈ నరసింహరాజు, ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



షాదన్ కళాశాల వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

బండ్లగూడ: శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసుల ముమ్మరంగా తనిఖీలు చేశారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారులపై నార్సింగి పోలీసులతో పాటు రెవెన్యూ అధికారులు భారీ ఎత్తున వాహనాల తనిఖీలను చేపడుతున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలను ఆపి వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రజలు ఎన్నికల నేపథ్యంలో అధిక నగదు, బంగారు తదితర వాటిని తమ వెంట తీసుకురావద్దన్నారు. ఎవరైనా వీటిని తీసుకొస్తే అట్టి పూర్తి దస్తావేజులు చూపించాల్సిన అవసరం ఉంటుందన్నారు. లేనిపక్షంలో వాటిని సీజ్ చేసి స్టేషన్‌కు తరలిస్తామన్నారు.

స్వామియే శరణం అయ్యప్ప



కోకాపేట అయ్యప్ప మహాపడిపూజలో పాల్గొన్న గురుస్వామి

మణికొండ: స్వామియే శరణం అయ్యప్ప.. అంటూ కోకాపేట గ్రామం అయ్యప్ప శరణుఘోషతో మార్మోగింది. సోమవారం గ్రామంలో కేశవగురుస్వామి మంత్రోచ్చరణల మధ్య అయ్యప్ప స్వామి 18వ మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు అరికెట రాముయాదవ్, గోపాల సంజీవకుమార్, అరికె శ్రీనివాస్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి నిర్వహించారు. గండిపేట మండల వ్యాప్తంగా తరలివచ్చిన అయ్యప్ప స్వాములు పడిపూజలో పాల్గొన్నారు. గంగపుత్ర నర్సింగరావు భక్తిపాటలు, భజనలు భక్తులను ఓలలాడించాయి. అనంతరం వెంకటమ్మ, అంజన్ కుమార్‌యాదవ్‌లు ఏర్పాటు చేసిన అన్నదానంతో అయ్యప్ప స్వాములతో పాటు గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

భారతీయ కళలను పరిరక్షించుకోవాలి



మహతి ఆర్ట్స్ నిర్వాహకులను సత్కరిస్తున్న అతిథులు

నాంపల్లి: దేశ సంస్కృతి, సంప్రదాయాలు, కళలను పరిరక్షించుకోవాలని విశ్రాంత జిల్లా న్యాయమూర్తి నేరెళ్ల మాల్యాద్రి అన్నారు. మహతి ఆర్ట్స్ 20వ వార్షికోత్సవ వేడుకలు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహతి ఆర్ట్స్ విద్యార్థులు ప్రదర్శించిన సంగీత కచేరిని ఆలకించి, అనంతరం కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బుల్లి తెర నటులు డాక్టర్ సుదర్శన్, కర్ణాటక సంగీత విద్వాంసురాలు హరిప్రియ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎం.సి.సభ్యులు పి.జ్యోతి, ఎస్9 టీవీ సీఈఓ ఎం.రవికుమార్, మహతి ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.కె.వెంకటాచారి, కార్యదర్శి కృష్ణకుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్‌కు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు ముమ్మర ప్రచారం నిర్వహించారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్‌లో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ.. ఓటర్లను కలుసుకుని బీఆర్ఎస్ పార్టీకి ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో ఉండే నాయకుడినే ప్రజలు ఎన్నుకోవాలన్నారు. గత 15 ఏళ్లుగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన ఘనత ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కే దక్కుతుందన్నారు. మరోసారి ఆయన గెలుపొందితే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తారన్నారు. ప్రజలంతా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్పొరేటర్లు సంతోషిరాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సదానందంగౌడ్, దశరథ్ తదితరులున్నారు.

డివిజన్ నుంచి అత్యధిక మెజార్టీని అందిస్తాం..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ నుంచి అత్యధిక మెజార్టీ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్‌కు అందిస్తామని డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ అన్నారు. బుద్వేల్‌లోని బస్తీలు, కాలనీల్లో సోమవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వెంట రాగా ఓటర్లను కలుస్తూ.. కారు గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. డివిజన్ నుంచి అత్యధిక మెజార్టీ అందిస్తామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. పార్టీ నాయకులు బండారి శంకర్ తదితరులున్నారు.

వాసుదేవరెడ్డి నగర్‌లో..

అత్తాపూర్: అత్తాపూర్‌లోని వాసుదేవరెడ్డి నగర్‌లో సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మిద్దెల సురేందర్‌రెడ్డి, మిద్దెల సురేష్‌రెడ్డి, సోను, మధుసూదన్‌రెడ్డి, శేఖర్, సింగారం సతీష్, పీఎం ప్రశాంత్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, మిద్దెల హర్షిత్‌రెడ్డి తదితరులున్నారు.

బీజేపీతోనే అభివృద్ధి

మణికొండ: దేశంలో బీజేపీ అధికారంలో ఉండటంతో ప్రపంచంలోనే మేటి దేశంగా అభివృద్ధి సాధ్యమైందని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురికాలనీ, లక్ష్మీనగర్ కాలనీలలో ఇంటింటి ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే కేంద్ర, రాష్ట్ర నిధులతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీ ప్రకటించిన పథకాలను ఇంటింటికీ ప్రచారం చేసి బీజేపీని గెలిపించాలన్నారు. బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు బీరప్ప, మహిళా అధ్యక్షురాలు అనితాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందిర, నాయకులు రాఘవరెడ్డి, వేణుకుమార్, రాజేష్, శంకర్‌సింగ్, వందన, లక్ష్మీరాములు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి: ఎమ్మెల్యే అభ్యర్థిగా కొత్తవారికి అవకాశం కల్పించాలని మైలార్‌దేవ్‌పల్లి బీజేపీ సీనియర్ నాయకులు మల్లేష్ కోరారు. సోమవారం డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్, బాబుల్‌రెడ్డి నగర్‌లలో బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో చదువుకున్న అభ్యర్థికి ఓటువేసి గెలిపించాలని కోరారు.